నర్సింగ్ పోస్టుకు
దరఖాస్తుల ఆహ్వానం

మద్దూరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మద్దూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఖాళీగా ఉన్న నర్సింగ్ పోస్టుకు ఆగస్టు 2లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎస్‌వో స్వప్న ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసి ఉండాలన్నారు. దరఖాస్తుదారులు ఫారాలను కస్తూర్బా పాఠశాలలో అందించాలని సూచించారు.

ఇక.. హ్యామ్ రోడ్లు

- ఈ విధానంలో ఆర్అండ్‌బీ రోడ్ల నిర్మాణం
- జిల్లాలో రూ. 230 కోట్లతో 184.35 కిమీ మేర..
- సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 16 చోట్ల
- రోడ్ల నిర్మాణంతో పాటు కల్వర్టులు కూడా
- మొదటగా కాంట్రాక్టర్‌కు 40 శాతం నిధులు కేటాయింపు
- మిగతా 60 శాతం దశల వారీగా వడ్డీతో చెల్లించనున్న రాష్ట్ర ప్రభుత్వం
- 15 ఏళ్ల పాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే
- గురువారం నుంచే ప్రారంభమైన టెండరు ప్రక్రియ
- తీరనున్న వాహనదారుల ఇక్కట్లు



సిద్దిపేట జూలై 31 (ఆంధ్రజ్యోతి): కొద్ది నెలలుగా జిల్లాలోని చాలా ప్రాంతాలకు ప్రయాణించాలంటే రహదారులు సరిగా లేక వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడ్డారు. దీనిపై దృష్టి సారించిన ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అలాంటి రహదారుల నిర్మాణం చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జిల్లాలో కూడా రహదారుల నిర్మాణానికి రంగం సిద్ధమైంది. జిల్లాలో 16 రోడ్లకు గాను దాదాపు రూ.230కోట్లతో 184.35 కిలోమీటర్ల మేర హైబ్రిడ్ అన్యునిటీ మోడల్ (హ్యామ్) విధానంలో నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియ గురువారం నుంచే ప్రారంభమైంది. ఆగస్టు రెండో వారం లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆర్అండ్‌బీ అధికారులు యోచిస్తున్నారు.



నంగునూర్ మండలం మగ్దూంపూర్ వెళ్లే మార్గంలో గుంతలుగా మారిన రోడ్డు

టోల్ గేట్లు ఉండవు

సాధారణంగా రోడ్ల నిర్మాణ పనులను ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ), బిల్డ్ ఆపరేట్ ట్రాన్స్‌ఫర్ (బీవోటీ) విధానంలో ఆర్అండ్‌బీ చేపడుతుంది. అయితే, బీవోటీ పద్ధతిలో కాంట్రాక్ట్ సంస్థ మొత్తం ఖర్చుతో నిర్మాణం చేపట్టి, ఆ తర్వాత టోల్ గేట్ల ద్వారా ఆ ఖర్చును వసూలు చేసుకుంటుంది. ఈపీసీ విధానంలో నిర్మాణ భారం మొత్తం ప్రభుత్వంపై పడుతుంది. ఈ రెండు విధానాలకు భిన్నంగా ప్రభుత్వం ఇప్పుడు హ్యామ్ విధానాన్ని ఎంచుకుంది. ఈ విధానంలో నిర్మాణ వ్యయంలో 40 శాతాన్ని ప్రభుత్వం ముందుగా చెల్లిస్తుంది. మిగిలిన 60 శాతాన్ని 15 ఏళ్లలో ఏడాదికోసారి వడ్డీతో సహా దశల వారీగా చెల్లిస్తుంది. దీంతో నిర్మించిన రోడ్లపై ఎలాంటి టోల్‌గేట్లు ఉండవు. అంతేకాకుండా 15 ఏళ్ల పా టు సదరు కాంట్రాక్టర్ లేదా సంస్థ రోడ్ల నిర్వహణ బాధ్యత వహిస్తుంది.

జిల్లా వ్యాప్తంగా మొత్తంగా 16 చోట్ల

జిల్లా వ్యాప్తంగా 16 రోడ్లను రూ. 230 కోట్లతో 184.35 కి.మీ మేర నిర్మించనున్నది. ఈ మేరకు సిద్దిపేట జిల్లా సరిహద్దు ప్రాంతాలతో పాటు జిల్లాలోని రాజ్‌గోపాల్‌పేట-ఇబ్రహీంనగర్-గోనేపల్లి, రాంపూర్-మగ్దూంపూర్-సిద్దన్నపేట- నంగునూరు-అక్కెనపల్లి-గట్లమల్యాల-ఖాతా -నంగునూర్, హుస్నాబాద్‌లోని కోహెడ-రాంచంద్రాపూర్-వర్కొలు-దేవక్కపల్లి, తంగళపల్లి-గుంద్రారెడ్డిపల్లి, ముల్కనూర్-ఇందుర్తి-కోహెడ, బెజ్జంకి-పోతారం, గుగ్గిళ్ల-తిమ్మాయిపల్లి, కల్లెపల్లి-గూడెం రోడ్డు, బెజ్జంకి-ఎల్లంపల్లి, లక్ష్మాపూర్-తలరివానిపల్లి, బెజ్జంకి-కల్లెపల్లి,

మిగతా 8వ పేజీలో



నంగునూర్ మండలం బద్దిపడగ నుంచి సిద్దన్నపేట వరకు కంకర తేలిన రోడ్డు

రోడ్డు వేసే ప్రాంతం	కి.మీ
1. రాజగోపాల్‌పేట-ఇబ్రహీంనగర్	08.30 కి.మీ
2 రాంపూర్-నంగునూరు	26.00 కి.మీ
3 కొహెడ-దేవక్కపల్లి	14.60 కి.మీ
4 తంగళపల్లి-గుంద్రారెడ్డిపల్లి	08.00 కి.మీ
5 ముల్కనూర్-కోహెడ	16.00 కి.మీ
6 పోతారం ఎక్స్ రోడ్డు-బెజ్జంకి	04.80 కి.మీ
7 బెజ్జంకి-తిమ్మాయిపల్లి	08.30 కి.మీ
8 కల్లెపల్లి-గూడెం రోడ్డు	04.30 కి.మీ
9 బెజ్జంకి-తలారివానిపల్లి	09.60 కి.మీ
10 బెజ్జంకి-ముష్కాన్‌పేట	09.60 కి.మీ
11 తోటపల్లి-గునుకుల కొండాపూర్	04.40 కి.మీ
12 ముస్త్యాల-వడ్లకొండ	14.00 కి.మీ
13 చేర్యాల-నాగపురి	13.00 కి.మీ
14 రేబర్తి-కొండాపూర్	10.70 కి.మీ
15 వర్గల్-గజ్వేల్	10.75 కి.మీ
16 సూరంపల్లి-నాచారం	22.00 కి.మీ
మొత్తం	184.35

రైతన్నకు మరోసారీ

- పంట బీమాపై నిరాశ.. ఏడేళ్లుగా నిలిచిన పథకం
- వానాకాలం సీజన్ ముగిసినా స్పందించని ప్రభుత్వం
- యాసంగి నుంచైనా అమలు చేయాలని రైతుల విజ్ఞప్తి

గజ్వేల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పంట నష్టాలను భర్తీ చేసేందుకు ప్రకటించిన ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఈఏడాది కూడా అమలు చేయలేదు. వానాకాలం సీజన్ ముగింపు దశకు చేరుకున్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో రైతన్నల ఆశలు మరోసారి ఆవిరయ్యాయి. ఏడేళ్లుగా నిలిచిపోయిన ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తామని గతంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, ఆ హామీ కార్యరూపం దాల్చలేదు. దీంతో ఈ వానాకాలం సీజన్‌లో పంటలు దెబ్బతింటే రైతులకు నష్టపరిహారం అందే అవకాశం లేకుండా పోయింది.

జిల్లాలో యేటా వానాకాలంలో దాదాపు 5.40లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేస్తారు. కానీ ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. అనుకూలమైన వర్షాలు పడకపోవడం, యూరియా కొరత, రిజర్వాయర్ల నుంచి నీటి విడుదలలో జాప్యం వంటి సమస్య లు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యం లో ఫసల్ బీమా పథకం అమ ల్లో ఉంటే పంట నష్టం జరిగినా పెట్టుబడి ఖర్చులు కొం తైనా తిరిగి వస్తాయని రైతులు ఆశించారు. అయితే, ప్రభుత్వం స్పందించకపోవడంతో నిరాశ తప్పలేదు.

ఆశించిన స్థాయిలో లేని సాగు

ఈ ఏడాది జిల్లాలో పంటల సాగు ఆశించిన స్థాయిలో జరగలేదు. ప్రస్తుతం పత్తి లక్ష ఎకరాల్లో, మొక్కజొన్న 25వేల ఎకరాల్లో, వరి కేవలం లక్షా 80వేల ఎకరాల్లో మాత్రమే సాగు చేసినట్లు తెలుస్తోంది. గత మూడు, నాలుగేళ్లలో సగటున వరి 3.50లక్షల ఎకరాల్లో సాగవ్వగా, ఈ ఏడాది అందులో సగం కూడా సాగవడం గగనంగా మారింది. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, భూగర్భ జలాలు తగ్గిపోవడం, రిజర్వాయర్ల నుంచి నీరు సకాలంలో విడుదల కాకపోవడం వంటి కారణాల వల్ల రైతులు పంటల సాగుకు మొగ్గుచూపడం లేదు. అయితే, ఇటీవల కురిసిన వర్షాలతో నాట్ల పనులు వేగవంతమయ్యాయని, ఈ వర్షాలు పంటలకు ప్రాణం పోశాయని జిల్లా వ్యవసాయ అధికారులు తెలిపారు.

యాసంగి నుంచైనా అమల్లోకి వచ్చేనా?

అనూహ్యంగా పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులను

మిగతా 8వ పేజీలో



పొట్టకూటికి వచ్చి..
చితికిపోయి

- వలస కూలీల మరణాలపై నిర్లక్ష్యం
- చేతులు దులుపుకుంటున్న యజమానులు
- సొంత గ్రామానికి చేర్చేందుకు ఆర్థిక సమస్య

7

'పల్లె వెలుగు' చూడని
పల్లెలు

- గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు
- కొన్ని ఊర్లకు మాత్రమే సర్వీసులు
- ప్రైవేటు వాహనాలే దిక్కు..

8

అధికారులు వార్డుల్లో పర్యటించాలి

- వర్షాకాలం అప్రమత్తంగా ఉండాలి
- కౌన్సిల్ సమావేశంలో సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు



మాట్లాడుతున్న మంజులరాజనర్సు

సిద్దిపేట జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మంజులరాజనర్సు సూచించారు. సిద్దిపేట మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ మంజులరాజనర్సు అధ్యక్షతన గురువారం జరిగింది. మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్, వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి ఆమె సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో 30 అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వర్షపు నీరు నిలిచిపోతున్న వార్డుల్లో వెంటనే మొరం పోసి చదును చేయాలని మున్సిపల్ డీఈ, ఏఈలను ఆదేశించారు. అన్ని వార్డులలో పెండింగ్ పనుల నివేదికను సిద్ధం చేయాలని చెప్పారు. పట్టణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రజలు కూడా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్లలో నీరు నిలవకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు ప్రతిరోజూ ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. విలీన గ్రామాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని చెప్పారు. సిద్దిపేట మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలని కౌన్సిలర్లు ప్రభుత్వాన్ని కోరారు. గణపతి కుంటలోని మట్టిని అక్రమంగా తరలించడంపై దర్యాప్తు చేయాలని కౌన్సిలర్లు కోరగా, కమిషనర్ వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. వినాయక చవితి, బతుకమ్మ పండుగలకు ముందు చెరువులు, కుంటలను పర్యవేక్షించి అవసరమైన చోట మెట్ల మార్గాలు నిర్మించాలని అధికారులకు సూచించారు.



సమావేశానికి హాజరైన కౌన్సిల్ సభ్యులు

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ హైమావతి

చిన్నకోడూరు/సిద్దిపేటరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కాచి చల్లార్చిన నీటినే తాగాలని కలెక్టర్ హైమావతి ప్రజలకు సూచించారు. చిన్నకోడూరులో గురువారం ఆమె ఆకస్మికంగా పర్యటించారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు, పీహెచ్‌సీ, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, పోస్టాఫీసులను ఆమె పరిశీలించారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై సమీక్షించారు. నిర్మాణం ప్రారంభించని ఇళ్లను త్వరగా మొదలుపెట్టి పూర్తి చేయించాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అటెండెన్స్ రిజిస్టర్, ల్యాబ్, మెడిసిన్ స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. కాలం చెల్లిన మందులు వాడకూడదని హెచ్చరించారు. భూభారతి రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్‌కు సూచించారు. పోస్టాఫీసులో పెన్షన్ పంపిణీని పరిశీలించారు. పెన్షన్‌దారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సాంకేతిక సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పోస్ట్‌మాస్టర్‌ను ఆదేశించారు. ఆగ్రోస్ కేంద్రంలో ఎరువుల సరఫరా రిజిస్టర్‌ను పరిశీలించి, అక్రమాలకు తావివ్వకుండా చూడాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీపీవో స్వరూపరాణి, ఏడీఏ పద్మ, తహసీల్దార్ సలీం మియా, డిప్యూటీ తహసీల్దార్ రాజమధుకర్, ఎంపీడీవో జనార్దన్, ఎంపీవో సోమిరెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ ఐశ్వర్య, పంచాయతీ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చిన్నకోడూరులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

మెనూ ప్రకారం వండాలి

సిద్దిపేటరూరల్ మండలం పుల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం బగారా అన్నం, మిక్స్‌డ్ వెజిటెబుల్ కర్రీని వండాల్సి ఉండగా తెల్లన్నం, మిల్ మేకర్ కర్రీ, చింతపులుసును మాత్రమే వండడం, అలాగే, 95 మంది విద్యార్థులకు సరిపడా వండాల్సి ఉండగా తక్కువ మోతాదులో చేయడంతో మధ్యాహ్న భోజన కార్మికులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అల్పాహారం తిని ఒకరికి అస్వస్థత

- సాంబారులో పురుగులు.. హోటల్ సీజ్

దుబ్బాక, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని ఓ హోటల్‌లో గురువారం టిఫన్ చేసిన వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో దుబ్బాక సివిల్ ఆసుపత్రిలో చేర్పించారు. మున్సిపల్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దుబ్బాక శ్రీకృష్ణభవన్ హోటల్‌లో గురువారం రాజక్కపేట గ్రామానికి చెందిన దేవరాయ యాదగిరి, సిరికొండప్రసాద్ చారి, సిద్దిపేటకు చెందిన హరి టిఫిన్ చేసేందుకు వెళ్లి అక్కడ దోశ ఆర్డర్ ఇచ్చారు. టిఫిన్ తింటున్న క్రమంలో వారి ప్లేట్లలో పురుగులు వచ్చాయి. వెంటనే హోటల్ యజమానిని పిలిచి ప్రశ్నించారు. అతను నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేయగా సదరు యజమాని హోటల్ మూసేసి అక్కడి నుంచి జారుకున్నాడు. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేసేలోపు దేవరాయ యాదగిరి అస్వస్థతకు గురయ్యాడు. వాంతులు చేసుకుంటుడడంతో దుబ్బాక సివిల్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. హోటల్‌ను మున్సిపల్ అధికారులు సీజ్ చేశారు.

కోమటిబండకు
మల్లన్నసాగర్ జలాలు

- నీటి పంపింగ్ ప్రారంభం

గజ్వేల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): మల్లన్నసాగర్ రిజర్వాయర్ నుంచి తాగునీరు కోమటిబండ జీఎల్బీఆర్‌కు చేరుకుంది. మల్లన్నసాగర్ నుంచి ప్రత్యేక ట్యాపింగ్ పాయింట్ ద్వారా మంగోల్ వద్ద నిర్మించిన భారీ నీటిశుద్ధి జలాశయం నుంచి రూ.210 కోట్లతో 16 కిలోమీటర్లు పైప్‌లైన్ నిర్మాణం పూర్తిచేసి అక్కారం వద్ద పంప్ హౌజ్ నిర్మించి అక్కడి నుంచి నేరుగా కోమటిబండ గ్రౌండ్ లెవల్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించారు. మిషన్ భగీరథ ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో నీటిని తరలించారు. నీటి తరలింపు విజయవంతం అయిందని, నీటిని కాచి వడబోసుకుని తాగాలని ఎస్‌ఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

'అన్నవరం' రచనల్లో ప్రశ్నించేతత్వం

- ఆయనకు దాశరథి అవార్డు రావడం ఈ ప్రాంతానికే గర్వకారణం
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : కవి, రచయిత అన్నవరం దేవేందర్ రచనల్లో సామాజిక చైతన్యం, సామాజిక స్పృహ, ప్రశ్నించే తత్త్వం ఉంటుందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. దేవేందర్‌కు ప్రతిష్టాత్మకమైన దాశరథి కృష్ణమాచార్య, జర్నలిస్టు పొన్నం రవిచంద్రకు గద్దరు అవార్డు రావడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. గురువారం రాత్రి హుస్నాబాద్‌లో స్ఫూర్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో దాశరథి కృష్ణమాచార్య అవార్డు గ్రహీత అన్నవరం దేవేందర్, గద్దర్ అవార్డు గ్రహీత పొన్నం రవిచంద్రకు అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో చాడ మాట్లాడుతూ హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) గ్రామానికి చెందిన అన్నవరం దేవేందర్ రచనల్లో అన్యాయాలను ప్రశ్నించేవిగా ఉంటాయన్నారు. తెలంగాణ భాషను విశ్వవ్యాప్తం చేస్తుండడం సంతోషకరమన్నారు. దేవేందర్, రవిచంద్ర మరింత ఎదగాలని ఆకాంక్షించారు. అవార్డుల కోసం ఏనాడు వెంపర్లాడలేదని, ప్రభుత్వమే గుర్తించి దాశరథి పురస్కారం ఇవ్వడం సంతోషకరమని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల విద్యాలయాల కార్యదర్శి గాజుల శ్యాంప్రసాద్ అన్నారు. ఈ ప్రాంత మట్టి వాసనే ఈ అవార్డు రావడానికి కారణమైందని అన్నవరం దేవేందర్ తెలిపారు. ఇక్కడి పోరాటాలు, పరిస్థితులు తన కవిత, రచనలకు ప్రభావితం చేశాయన్నారు. ఈ సందర్భంగా అన్నవరం దేవేందర్, పొన్నం రవిచంద్రలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షులు పందిల్ల శంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, జర్నలిస్టులు కొండ లక్ష్మణ్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పి.తిరుపతి, నాయకులు వంగ వెంకట్రాంరెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ ఏజీపీ చిత్తారి రవీందర్, కొత్తపల్లి అశోక్, గడిపె మల్లేశ్, ముక్కెర సంపత్, అనగోని తిరుపతి తదితరులున్నారు.



అన్నవరం దేవేందర్, పొన్నం రవిచంద్రను సన్మానిస్తున్న నాయకులు

అత్యవసర సమయాల్లో
నిర్లక్ష్యం వహించొద్దు

చిన్నకోడూరు/మద్దూర్/సిద్దిపేట రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) అత్యవసర సమయాల్లో నిర్లక్ష్యం వహించకూడదని ఈఎమ్ఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ రాష్ట్ర నాణ్యత విభాగ తనిఖీ అధికారి కిశోర్ సూచించారు. చిన్నకోడూరులోని 108 అంబులెన్స్‌ను గురువారం ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్, జిల్లా మేనేజర్ హరి రామకృష్ణ కృష్ణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్‌లోని పరికరాలను, రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అలాగే నారాయణరావుపేట మండలం గుర్రాలగొందిలో ఈఎంఆర్ఐ, గ్రీన్ హెల్త్ సర్వీసెస్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్‌షాహిద్, జిల్లా మేనేజర్ హరిరామకృష్ణ 108 అంబులెన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అత్యవసర సమయంలో ఎలాంటి సేవలు అందించాలో సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. మద్దూరు మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్‌ను క్వాలిటీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.

గిట్టుబాటు ధర వచ్చే వరకు
ధాన్యం నిల్వ చేసుకోవచ్చు

సిద్దిపేటరూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) ; పంటలను గిట్టుబాటు ధర వచ్చే వరకు సాధారణ రుసుముతో గోదాముల్లో నిల్వ చేసుకోవచ్చని ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ సంస్థ (ఐసీఎం) ప్రోగ్రాం డైరెక్టర్ డాక్టర్ శ్యాంకుమార్ రైతులకు సూచించారు. గురువారం నారాయణరావుపేట మండలం గుర్రాలగొంది రైతువేదికలో గోదాముల వినియోగంపై రైతులకు అవగహన కల్పించారు. రైతులు శ్రమించి పండించిన పంటను ఎంతో కొంతకు అమ్ముకుని నష్టపోతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితి నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిడ్డంగుల అభివృద్ధి, నియంత్రణ సంస్థ ను ఏర్పాటు చేసిందన్నారు. గుర్రాలగొందిలో ఉన్న గోదాములు ఇలా ఏర్పాటు చేసినవేనని తెలిపారు. గోదాముల్లో నిల్వ చేసిన సరుకుపై 80 శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సత్తయ్య, డీసీసీబీ సూపర్‌వైజర్ శ్రీధర్, ఏఈవో మౌనిక, సొసైటి సీఈవో నాగరాజు, సిబ్బంది, పలువురు పాల్గొన్నారు.

140 మంది బాల కార్మికులకు విముక్తి

- ఆపరేషన్ ముస్కాన్ నిరంతర ప్రక్రియ
- మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలో 140 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించామని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించామన్నారు. 90 కేసులను నమోదు చేశామన్నారు. భావిభారత పౌరులైన చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ నిరంతరం సాగే ప్రక్రియ అని ఎస్పీ తెలిపారు. యువత ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో నేరాల నియంత్రణపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలన్నారు. నమోదైన కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సీసీ టీవీలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, పేకాటపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విజబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తున్న కంపెనీ యాజమానులపై కేసు నమోదు

రాయపోల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులతో పని చేయిస్తున్న కోళ్ల దాన తయారీ కంపెనీపై దాడి చేసి బాలలకు విముక్తి కల్పించి నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయపోల్ ఎస్ఐ మానస కథనం ప్రకారం ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో ప్రీమియం చిక్ ఫీడ్ సంస్థలో లేబర్ ఆఫీసర్లు తనిఖీ చేయగా ఐదుగురు బాల కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారికి విముక్తి కల్పించి చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. సంస్థ యజమానులు సత్యేంద్రకుమార్, సమాధానం తాత్యాబులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు గంజాయి కేసుల్లో ఇద్దరికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి అక్రమంగా తరలించిన మునిపల్లి మండలానికి చెందిన ఒకరు, సిర్గాపూర్ మండలానికి చెందిన మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష ఖరారైంది. సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ నజీర్ పాష తెలిపిన వివరాల ప్రకారం.... మునిపల్లి మండలం పెద్దలోని గ్రామానికి చెందిన మన్నె రాములు 2022లో అక్రమంగా 36 గంజాయి మొక్కలను సాగు చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో మన్నె రాములుకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ జిల్లా అదనపు న్యాయాధికాది జయంతి గురువారం తీర్పు వెలువరించారు.

ఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సిర్గాపూర్ మండలం వంగ్దాల్ పరిధిలోని గైర్యాన్ తండాకు చెందిన మూడ్ గణపతి చౌహాన్ తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అప్పటి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి బాలకిష్టారెడ్డి, ఎస్ఐ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 2013 ఆగస్టు 24న దాడి చేశారు. గణపతి చౌహాన్ పొలంలో 75 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసును జిల్లా అదనపు కోర్టులో విచారణ జరపడంతో కోర్టు పీపీ రాజేశ్వర్ వాదించి నేరం రుజువు చేయడంతో నిందితుడికి న్యాయమూర్తి జయంతి ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.25 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు.

చేర్యాలలో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారులో గంజాయి విక్రయానికి యత్నించిన ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్, పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు చేర్యాల సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ ఎల్.శ్రీను నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన నీలం చందు, ఆకుల హర్షవర్ధన్ జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయానికి పాల్పడుతున్నారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఆకుల హర్షవర్ధన్ టెంట్‌హౌజ్‌లో, ఇంటర్ చదివిన చందు కూలీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు గంజాయి విక్రయానికి అలవాటుపడ్డారు. హైదరాబాదులో గుర్తుతెలియని వ్యక్తినుంచి గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా విక్రయించేందుకు యత్నిస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు దాడులు చేపట్టి ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 180 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసి స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. కాగా, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని, గంజాయి సేవనానికి పాల్పడినా, విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. మత్తుఅలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలిపారు. సమావేశంలో చేర్యాల ఎస్ఐ నవీన్, టాస్క్‌ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


అరెస్ట్ వివరాలు తెలుపుతున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష

సిద్దిపేట క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తేవాలని భార్యను వేధించి గొంతునులిమి చంపిన కేసు భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన గంగసాని శ్రీనివాస్‌కు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ఇందిరాతో 2011లో వివాహం జరిగింది. కొద్ది రోజులు వారి సంసారం సాఫీగానే సాగింది. తర్వాత భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకొని రమ్మని మానసికంగా ఇందిరాను హింసించారు. 2019 ఏప్రిల్ 9వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఇందిరా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.పదివేల అదనపు కట్నం కావాలని లేకుంటే బంగారం గుంజుకుంటామని బెదిరిస్తున్నారని తెలిపింది. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు ఇందిరా చనిపోయిందని ఫోను రాగానే కుటుంబ సభ్యులు కలసి విఠలాపూర్‌కు వచ్చారు. ఇందిరా మృతదేహాన్ని చూసిన తర్వాత మృతురాలి సోదరుడు వీరేష్‌రెడ్డి తన బావ శ్రీనివాస్‌రెడ్డి, తన చెల్లెలు ఇందిరాను గొంతు పిసికి చంపారని చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశాడు. అప్పటి రూరల్ సీఐ వెంకట్‌రామయ్య కేసు పరిశోధన ప్రారంభించి నేరస్థుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరామాదేవి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున శ్రీనివాస్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2000 జరిమాన విధించారు.


రోడ్డుపై అడ్డంగా బోల్తాపడిన లారీ

హైవేపై రెండు లారీలు బోల్తా

- ఒకదానికొకటి ఢీకొనడంతో ప్రమాదం

మనోహరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రెండు లారీలు ఢీకొన్న ఘటన గురువారం మనోహరాబాద్ మండలం దండుపల్లి 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దండుపల్లి ఐటీసీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న భారీ లారీని మరో లోడ్‌తో ఉన్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కంటైనర్ బాడీతో ఉన్న లారీ హైవేపై రోడ్డుకు అడ్డంగా బోల్తా పడగా, మరొక లారీ రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు.

బాలిక నిశ్చితార్థం అడ్డుకున్న అధికారులు

మాసాయిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామంలో గురువారం జరగాల్సిన బాలిక నిశ్చితార్థాన్ని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు కలిసి అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17)కు గురువారం నిశ్చితార్థం చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక ఇంటికి వెళ్లారు. అప్పటికే వరుడు కూడా అక్కడికి రాగా, వరుడికి.. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. నిశ్చితార్థాన్ని నిలిపివేశారు. బాలిక మైనారిటీ తీరిన తర్వాత వివాహం చేయాలని సూచించారు.

అధికారులకు నోటీసులు అందజేసిన అటవీశాఖ

జహీరాబాద్,జూలై 31(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో చెట్ల నరికివేతకు కారణమైన విద్యుత్‌శాఖ అధికారులకు గురువారం జహీరాబాద్ పట్టణ అటవీ శాఖ సెక్షన్ అధికారి కిరణ్ వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ అధికారులైన, ప్రజలైన ఇష్టారీతిన చెట్లను నరికివేస్తే చర్యలు తప్పవన్నారు. చెట్లను నరికివేయాలంటే అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. తాము అందజేసిన నోటీసులకు వివరణ ఇవ్వకపోతే కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. చెట్ల నరికివేతకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గేదెను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

కౌడిపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బైక్‌తో గేదెను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ధర్మసాగర్ శివారులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బురుగడ్డకు చెందిన మ్యాకల నాగరాజు(42) బైక్‌పై మండల కేంద్రంలోని మార్కెట్‌కు కూరగాయల కోస వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ధర్మసాగర్ శివారులో గేదెను బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగరాజును వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. నాగరాజుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గురువారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాల గ్రామానికి చెందిన మెరిగే నర్సింహులు రోజువారీలా గురువారం తాటివనంలో తాటిచెట్టు ఎక్కుతుండగా, ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో గాయాలపాలవడంతో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స జరిపగా, మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన నర్సింహులుకు వెంటనే ఎక్స్‌గ్రేషియో అందించి ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్‌కుమార్ కోరారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకురావాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగుల వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

కంది, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మంత్రిగారు మా సమస్యలు పరిష్కరించి, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కిషన్‌రెడ్డిని ఆయన కార్యాలయలంలో గురువారం బీజేపీ సీనియర్ నాయకులు నల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) నాయకులు ఎల్.బాలనర్సయ్య, బి.ఈశ్వరయ్య, కె.ప్రభు, టి.రవి, బి.శివకుమార్, కంది శ్రీనివాస్, టి.ప్రదీప్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ రంగానికి వెన్నుముకగా నిలిచిన మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేటీకరణ తర్వాత వర్క్‌లోడ్ లేక నిరాశకు గురవుతున్నారు. రెండేళ్ల నుంచి పాత పద్ధతిలో పింఛన్ ఇవ్వాలని ఉద్యోగులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. ఇందుకు కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించనున్నట్లు వారు తెలిపారు. అతి త్వరలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలవనున్నట్లు తెలిపారు. 500ల బీఎంపీ-2 యుద్ధ వాహనాలు, నాగ్-2 వెపన్స్ తయారీ ఆర్డర్లు, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరనున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

జంగమ సమాజ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన జగద్గురు



ఖేడ్‌లో జంగమ సమాజన భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న చంద్రశేఖర్ శివాచార్య

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులో జంగమ సమాజ భవన నిర్మాణానికి గురువారం కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య భూమి పూజను నిర్వహించారు. నిర్మాణ పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని స్థానిక జంగమ సమాజం బాధ్యులకు సూచిస్తూ భవన నిర్మాణం కోసం తనవంతుగా రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతిస్వామి, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు బార్శిమణికంఠస్వామి, జంగమ సమాజం బాధ్యులు సిద్ధయ్యస్వామి, రేవణయ్య, నరేష్‌స్వామి, విజయ్‌కుమార్ స్వామి, సతీష్ స్వామి, బస్వరాజ్ స్వామి, తదితరులుపాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోగలం

● ఆగస్టు 15లోపు పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ

● ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్

హుస్నాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా ఉంటేనే మన హక్కులను సాధించుకోగలుగుతామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన లెక్చరర్ చాడ మధుసూదన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల 57 డిమాండ్లలో మన పోరాటాలతో ప్రభుత్వం 16 డిమాండ్లు ఒప్పుకుందని తెలిపారు. వీటిని ఆగస్టు 15లోపు పరిష్కరించకుంటే మరొక ఉద్యమ కార్యాచరణ చేపడుతామని వెల్లడించారు. ప్రస్తుతం 90 శాతం జీపీఎఫ్ వస్తుందన్నారు. ప్రొఫెసర్ల వలే లెక్చరర్లకూ ఉద్యోగ విరమణ 65 సంవత్సరాలు ఉండాలనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చూస్తామన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.13 వేల కోట్లు అప్పు పడిందన్నారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి సహాయం చేయాలని, వీకర్ సెక్షన్లను ఆదుకోవాలని, కానీ అన్ని ఉచితాలు ఇవ్వొద్దని తాను అనడంతో విమర్శలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఒక డీఏ ఇప్పించామని, ఇంకో డీఏ ఆరు నెలలకు ఇస్తామన్నారని తెలిపారు. రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులుంటే దాదాపు 120 మంది ఏసీబీకి పట్టుబడితే ఉద్యోగులందరినీ అవినీతిపరులనడం కరెక్ట్ కాదని, ప్రభుత్వాన్ని నడిపేదే ఉద్యోగులని వెల్లడించారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నర్సయ్య గౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, జర్నలిస్టు కొండా లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులున్నారు.

పొట్టకూటికి వచ్చి.. చితికిపోయి



వలస కూలీల మరణాలపై నిర్లక్ష్యం

చేతులు దులుపుకుంటున్న యజమాన్యాలు

సొంత గ్రామానికి చేర్చేందుకు ఆర్థిక సమస్య

అనాథ శవంగా అంతిమ సంస్కారాలు

పారిశ్రామిక ప్రాంతాల్లో హృదయవిదారక ఘటనలు



బీహార్ రాష్ట్రానికి చెందిన సద్దాం ఆరుగురుసభ్యులున్న తన కుటుంబపోషణ కోసం వందల కిలోమీటర్ల దూరంలోని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడకు వచ్చాడు. ఓ కంపెనీలో రూ.15 వేల వేతనానికి పనిలో చేరాడు. ఊర్లోని కుటుంబానికి డబ్బు పంపుతుండేవాడు. ఓరోజు అకస్మాత్తుగా విధి నిర్వహణలో ఉన్నప్పుడే సద్దాంకు వాంతులు అయ్యాయి. తోటి వారి సహకారంతో అద్దెకున్నచోటుకు వచ్చాడు. దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అర్ధరాత్రి సమయంలో మృత్యువాతపడ్డాడు. తోటి కార్మికులు సద్దాం మృతదేహాన్ని గ్రామానికి పంపడానికి డబ్బు కావాలని కంపెనీ యజమానిని అడిగితే సంబంధం లేదంటూ సమాధానం ఇవ్వడంతో చేసేది లేక స్థానికంగా అనాథ శవంగా అంతిమ సంస్కారాలు చేశారు. శవం కాలుతున్న సమయంలో కుటుంబసభ్యులకు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా చూపించారు. కుటుంబానికి అదే చివరిచూపుగా మారింది. పొట్టకూటి కోసం పటాన్‌చెరు పారిశ్రామికవాడకు వచ్చే వలస కూలీలకు మరణంలోనూ వెంటాడుతున్న దుర్భర దుస్థితికి ఈ ఘటన ఓ నిదర్శనం. విదేశాలకు వెళ్లి చనిపోయిన వారి మృతదేహాలను ప్రభుత్వాలు రప్పిస్తున్న ఈ రోజుల్లో పారిశ్రామికవాడ నుంచి పక్క రాష్ట్రాలకు పంపించేందుకు చొరవ చూపేవారేరి?

ఐడీఏ బొల్లారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పుట్టిన ఊరును, కన్నవారిని, కుటుంబాన్ని వదిలి వచ్చిన వలస కూలీలకు పారిశ్రామికవాడలు మరణశయ్యలుగా మారుతున్నాయి. ఇక్కడ జీవనోపాధి కోసం వచ్చిన అనేక మంది అనారోగ్య సమస్యలతో అనాథ శవాలుగా మృత్యుఒడిలోకి చేరి, కుటుంబ సభ్యులకు చివరిచూపు కూడా దక్కకుండానే కనుమరుగవుతున్నారు. పని ప్రదేశంలో ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు యజమానులు నిర్లక్ష్యం వహించడం, వైద్య ఖర్చులు భరించకపోవడం వల్ల అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. చనిపోయిన తర్వాత మృతదేహాన్ని వారి స్వగ్రామాలకు పంపించేందుకు కూడా డబ్బు లేక, తోటి కార్మికులు, స్వచ్ఛంద సంస్థల సాయంతో స్థానికంగానే అంత్యక్రియలు జరిపిస్తున్నారు. వాట్సాప్ వీడియోలో వారి చివరిచూపును చూసి కన్నీరు పెట్టుకోవడం తప్ప కుటుంబసభ్యులకు మరో దారి లేకుండా పోతోంది.

పని ప్రదేశాల్లో నిర్లక్ష్యం

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐడీఏ బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, ఖాజీపల్లి, పటాన్‌చెరు, పాశమైలారం, రుద్రారం వంటి పారిశ్రామికవాడల్లో బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో వలస కార్మికులు పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు యజమానులు వారికి ఎలాంటి సంబంధం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారు. యజమాన్య సంఘాలు అయితే ప్రమాదాల వేళ సహాయం చేసుకుంటాయి. పటాన్‌చెరు, పాశమైలారం, బొంతపల్లి పారిశ్రామికవాడలకు ప్రత్యేకంగా ఐలాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో యజమానులు సంఘాలుగా ఏర్పడ్డారు. ఒక యజమాని కంపెనీలో అగ్నిప్రమాదం లాంటి సంఘటనలు జరిగితే ఒకరికొకరు సహకారం చేస్తారు. కానీ, కార్మికుల అనారోగ్యం, మరణాల విషయంలో మాత్రం నిస్సహాయంగా వ్యవహరిస్తున్నాయి.

ఆరోగ్య భద్రత ఏదీ?

వలస కార్మికుల మరణాలు కేవలం నిర్లక్ష్యం వల్ల మాత్రమే జరగడం లేదు. దీని వెనుక అనేక లోతైన సామాజిక, ఆర్థిక సమస్యలు ఉన్నాయి. వలస కార్మికులకు సరైన ఆరోగ్య బీమా ఉండదు. ఒకవేళ ఉన్నా, దానిని ఉపయోగించుకోవడానికి అవసరమైన సమాచారం, సమయం, అక్షరాస్యత లేదు. యజమానులు కూడా కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ వారికి కనీస ఆరోగ్య భద్రత కల్పించడం లేదు. ఎక్కువ పని గంటల కారణంగా కార్మికులు శారీరకంగా, మానసికంగా అలసిపోయి, చిన్నపాటి ఆరోగ్య సమస్యలు కూడా పెద్దవిగా మారి ప్రాణాలు తీస్తున్నాయి. మరణించిన తర్వాత మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు అయ్యే ఖర్చులను భరించే స్థోమత ఉండకపోవడంతో, వారు నిస్సహాయులై తమవారి అంతిమ సంస్కారాలను వాట్సాప్ వీడియోల్లోనే చూసుకుంటున్నారు. ఈ దయనీయ పరిస్థితి వలస కార్మికుల పట్ల ఉన్న ఉదాసీనతను, వారి జీవన పోరాటంలో దాగి ఉన్న కఠిన వాస్తవాలను కళ్లకు కడుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే, కేవలం యజమానుల బాధ్యతను పెంచడమే కాకుండా, ప్రభుత్వాలు కూడా వలస కార్మికుల భద్రత, ఆరోగ్య సంరక్షణ కోసం కఠినమైన చట్టాలను అమలు చేయాలి.

కొన్ని ఘటనలు

● బీహార్ రాష్ట్రం రామ్‌గర్వ తాలూకా ఐనార గ్రామానికి చెందిన అమన్ కాటూన్ గడ్డపోతారం ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. కుటుంబకలహాలతో అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పనిచేస్తున్న కంపెనీ యజమాని సంబంధం లేదంటూ చేతులు ఎత్తివేసింది. శవాన్ని సొంత గ్రామానికి పంపాలంటే డబ్బు లేకపోవడంతో పోలీసులతో పాటు చుట్టుపక్కల వారు విరాళాలుగా వేసుకొని రూ.60వేలు ఇచ్చి వాహనం మాట్లాడి పంపారు.

● బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు పటాన్‌చెరు పారిశ్రామికవాడలో పని చేయడానికి వచ్చాడు. సొంత గ్రామానికి చెందిన స్నేహితుడి రూంలో దిగాడు. కంపెనీలో డ్యూటీ చేయడానికి వెళ్లగానే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన వ్యక్తిని సొంత గ్రామానికి తీసుకువెళ్లలేక ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఎండీఆర్ ఫౌండేషన్ వారు దహన సంస్కారాలు చేశారు. చితి కాలుతుండగా కుటుంబసభ్యులకు వాట్సాప్‌లో చూపించారు.

● ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బచ్చన్ సింగ్ రెండు నెలల క్రితం ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడకు వచ్చారు. రెడీమిక్స్ యూనిట్‌లో కార్మికుడుగా పని చేస్తున్నాడు. అతడికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. తీసుకువచ్చిన కాంట్రాక్టర్ బచ్చన్‌సింగ్‌ను కారులో సొంత గ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. ఖాజీపల్లి అవుటర్ ఎక్కగానే చనిపోయాడు. భయపడిన కారు డ్రైవర్ శవాన్ని ఫుట్‌పాత్‌పై పడుకోబెట్టి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అనంతరం మరో కారులో పోలీసులు ఇచ్చిన పత్రం ఆధారంగా సొంత గ్రామానికి పంపారు.

● ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ పటాన్‌చెరు ప్రాంతంలోని ఓ ఫార్మా అనే పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్నప్పుడే స్పృహ తప్పికింద పడిపోయాడు. అనంతరం ప్రాథమిక వైద్యం అందించారు. అద్దెకుంటున్న ఇంట్లోనే చనిపోయాడు. అతడి మృతదేహాన్ని సొంత గ్రామానికి పంపించే క్రమంలో పరిశ్రమ యాజమాన్యంతో స్థానికులు గొడవ చేస్తే రూ.8 లక్షలు పరిహారం ఇచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో సొంత గ్రామానికి మృతదేహాన్ని పంపించారు.



రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ సురేష్ షెట్కార్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నారని, 11 రాష్ట్రాల్లో మాత్రం ఓబీసీగా పరిగణిస్తున్నారన్నారు. దీంతో రజక కులానికి న్యాయం జరగడం లేదన్నారు. అన్ని రాష్ట్రాల మాదిరిగా న్యాయం జరగాలని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకొని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు.

సిగాచి పరిహారంపై రాజకీయం చేయొద్దు

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో మృతిచెందిన కార్మికులకు పరిహారం ఇప్పించలేని మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఇప్పుడు సిగాచి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలంటూ కోరడం హాస్యాస్పదంగా ఉందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద విషయం తెలిసిన మరుక్షణం సీఎం రేవంత్‌రెడ్డి పరిశ్రమకు వచ్చి పరిస్థితిని చూసి మృతులకు రూ.కోటి పరిహారం చెల్లించేటట్టు ఏర్పాటు చేస్తామని చెప్పారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే కొంత మొత్తం చెల్లింపులు సైతం జరిపారని అన్నారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, గడ్డం వివేక్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పర్యవేక్షణ జరుపుతున్నారని వివరించారు. జిల్లాలో ప్రమాదాల బారినపడి 110 మంది కార్మికులు చనిపోయారని తెలిపారు. రూ.20 లక్షలు కూడా ఇప్పించని హరీశ్‌రావు మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు.

పల్లెవెలుగు బస్సులకే.. ఎక్స్‌ప్రెస్ బోర్డులు

● ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ చార్జీల వసూలు ● ఆర్టీసీ వింత పోకడ

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రాంతాల ప్రయాణికుల సౌలభ్యానికి వినియోగించాల్సిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్ బోర్డులు ఏర్పాటు చేసి పట్టణ ప్రాంతాలకు నడుపుతున్నారు. పల్లెవెలుగులో ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

ఖేడ్ డిపోలో యాభై శాతం ఎక్స్‌ప్రెస్‌లే..

నారాయణఖేడ్‌లో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ, ప్రధానమైన గ్రామీణ రూట్లలో బస్సులను నడపకుండా హైదరాబాద్ రూట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉన్న బస్సుల్లో 50 శాతానికిపైగా ఎక్స్‌ప్రెస్ బస్సులే ఉన్నాయి. అయినప్పటికీ పల్లె వెలుగు బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి సంగారెడ్డి, పటాన్‌చెరు, లింగంపల్లి, ప్రాంతాలకు నడుపుతున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నడపడానికి కేటాయించిన బస్సులను కూడా ఈవిధంగా నగరానికి నడుపుతుండడంతో, గత్యంతరం లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. మరోవైపు ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తూ, పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా నడుపుతూ తమను అసహనానికి గురి చేస్తున్నారని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. నారాయణఖేడ్ డిపోలో ఎక్కడ లేని ఈ విధానం కొనసాగుతుండడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఎం మల్లేశయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా డిపోలో అవసరానికి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు లేనందున ఈ విధంగా నడుపుతున్నట్లు సమాధానమిచ్చారు.



ఆ ఎనిమిది మంది ఏమయ్యారు?

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్



మాట్లాడుతున్న జయరాజ్

పటాన్‌చెరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమలో పనిచేస్తూ కనిపించకుండా పోయిన ఎనిమిది మందిని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు శ్రామిక్‌భవన్‌లో రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సిగాచిలో ప్రమాదం జరిగి 30 రోజులు గడుస్తున్నా చనిపోయిన 54 మందికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న వారి కుటుంబీకులు ఎక్కడికి వెళ్లాలో తెలియక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. చనిపోయిన మృతుల కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు త్వరితగతిన అందజేసేటట్టు ఇస్నాపూర్ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోడకాకర.. బహుప్రియం

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మాత్రమే లభించే అడవి కాకర కాయలు(బోడకాకర) మార్కెట్‌లలో ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. ఈ సీజన్‌లో లభించే బోడకాకరను కొనేందుందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. గతంలో బోడకాకరకాయలు గ్రామాల్లో ఉచితంగా లభించేవి. క్రమేణా ఈ జాతి కాకర కనుమరుగుతవుతుండడంతో విరివిగా లభించడం లేదు. దీంతో ప్రస్తుతం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నారాయణఖేడ్ మార్కెట్లో విక్రయానికి వచ్చిన బోడకాకర కిలో రూ.200 వరకు పలికింది. అంత ధర ఉన్న జనాలు కొనుగోలు చేశారు.



విద్యాధరిలో బండ ప్రకాశ్ ప్రత్యేక పూజలు



శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ గురువారం కటుంబసమేతంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విదాధరి క్షేత్రాన్ని సందర్శించారు. విద్యాసరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో ఆయన మనవడు భవ్యాంక్‌కు వేద పండితులు వేద మంత్రోచ్చరణల మధ్యన అక్షర స్వీకారం చేయించారు.

-వర్గల్, జూల్ 31 (ఆంధ్రజ్యోతి)

డ్రంకెన్ డ్రైవ్‌లో పలువురికి జైలు, జరిమానా

చేర్యాల/కొమురవెల్లి,జూలై31(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి జైలు శిక్ష, జరిమారా విధించారు. చేర్యాల సర్కిల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల నమోదైన పలు డ్రంకెన్‌డ్రైవ్ కేసులను గురువారం పరిశీలించిన చేర్యాల మున్సిఫ్ కోర్టు జడ్జి బి.రేవతి పలువురికి రూ.13వేలు జరిమానా విధించారు. ఈమేరకు చేర్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో -3, కొమురవెల్లి పరిధిలో -13, మద్దూరు పోలీస్‌స్టేన్ పరిధిలో-5 కేసులను విచారించి జరిమానా విధించారు. అలాగే కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఓ డ్రంకెన్ డ్రైవ్‌కేసులో ఐనవోలు గ్రామానికి చెందిన జి.రాజుకు రెండురోజుల జైలుశిక్ష విధించారు.

డాక్టర్ రఘురాంరెడ్డికి ప్రొఫెసర్‌గా పదోన్నతి

మర్కుక్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రవల్లి గ్రామానికి చెందిన డాక్టర్ రఘురాంరెడ్డి ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. సంగారెడ్డి మెడికల్ కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న రఘురాంరెడ్డికి ఇటీవల వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చిన పదోన్నతులలో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు. ఈ మేరకు సూర్యాపేట మెడికల్ కళాశాల సర్జికల్ విభాగం హెడ్ ఆఫ్‌ది డిపార్ట్మెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయగా ఈ మేరకు రఘురాంరెడ్డి సూర్యాపేట మెడికల్ కళాశాలలో జాయిన్ అయ్యారు.

మద్యం ప్రియులకే 'ఫ్రీడం'పార్క్



మద్యం ప్రియులు తాగిపడేసిన ఖాళీబాటిళ్లు

దుబ్బాక,జూలై 31(ఆంధ్ర జ్యోతి): దుబ్బాక మున్సిపాలిటీ దుంపలపల్లి నాలుగోవార్డులో 2022లో నాలుగు లక్షలతో ఫ్రీడం పార్క్‌ను నిర్మించారు. ఇందులో టైర్లతో తయారు చేసిన ఊయలలు, వివిధ ఆకృతులతో తయారు చేసిన కుర్చీలు, రంగురంగుల ముగ్గులతో చెట్టు సిమెంటు గద్దెను నిర్మించారు. దీని నిర్వాహణను మున్సిపల్ సిబ్బంది మరవడంతో అధ్వాన్నంగా మారి, మద్యం ప్రియులకు అడ్డాగా మారింది. ఏపుగా పెరిగిన గడ్డి, ఎక్కడపడితే అక్కడ మద్యం బాటిళ్లు, ప్లాస్టిక్ గ్లాసులు దర్శనం ఇస్తున్నాయి. లక్షలు వెచ్చించి, సాయంత్రం పూట ఆహ్లాదం కలిగించే పార్క్ ప్రస్తుతం మూలనపడి, మద్యంప్రియులకు నిలయంగా మారింది.

శేష జీవితాన్ని ఆనందంగా గడపాలి

సిద్దిపేట క్రైం జూలై 31(ఆంధ్రజ్యోతి): పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఏఆర్ అదనపు డీసీపీ సుభాష్ చంద్రబోస్ సూచించారు. పదవి విరమణ పొందిన సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న ఎస్సైలు కోళ్ల కనకయ్య గౌడ్, మేకల కొమురయ్య, సిద్దిపేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో ఎస్సై గా పనిచేస్తున్న వడపల్లి రఘు లను ఏఆర్ అదనపు డీసీపీ అభినందించి కమిషనర్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలను పొందినారని శుభాకాంక్షలు తెలియజేస్తూ రిటైర్మెంట్ బెనిఫిట్ పత్రాలు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ అందజేత

కొమురవెల్లి,జూలై31(ఆంధ్ర జ్యోతి) ఏమ్మేల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైన మూడు లక్షల రూపాయల సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ చెక్కును గురువారం రసూలాబాద్ గ్రామానికి చెందిన ఏండీ సొహెల్‌కు గ్రామ మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు పచ్చిమడ్ల స్వామీ గౌడ్ అందించాడు.

'పల్లెవెలుగు'లు చూడని పల్లెలు

- గ్రామాలకు రాని ఆర్టీసీ
- కొన్ని గ్రామాలకే సర్వీసులు

బెజ్జంకి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) :గ్రామీణ ప్రాంతాల్లో బస్సుల సౌకర్యం లేక ప్రజలకు ప్రైవేట్ వాహనాలే దిక్కు అవుతున్నాయి. పల్లెల నుంచి మండల కేంద్రానికి, జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రైవేట్ వాహనాలనే ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు, విద్యార్థినులకు బస్సు సౌకర్యం లేక మహాలక్ష్మీ పథకం ఉపయోగం లేకుండా పోయింది. బెజ్జంకి మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామాల మీదుగానే పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడుస్తున్నాయి. ఆయా గ్రామాల మీదుగా మండల కేంద్రం నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే కనీసం బస్సు సౌకర్యం కూడా మండల ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. దీంతో మండల ప్రజలు బస్సు సౌకర్యానికి నోచుకోక అవస్థలు పడుతున్నారు.



కరీంనగర్ బెజ్జంకి పల్లె వెలుగు బస్సు

కొన్ని గ్రామాల మీదుగానే సర్వీసులు

బెజ్జంకి మండలంలో 24 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 11 గ్రామాలకు మాత్రమే బస్సు సౌకర్యం నామ మాత్రంగా ఉండగా మండలంలోని మిగతా 13 గ్రామాలకు బస్సు సౌకర్యం లేకుండా ఉంది. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ పథకం ఉపయోగం లేకుండా ప్రజలకు బస్సు సౌకర్యం లేకుండా పోయిందని మహిళలు, విద్యార్థినులు వాపోతున్నారు.

బస్సు సర్వీసులు పెంచితే ఉపయోగకరంగా ఉంటుంది

మండల కేంద్రం నుంచి సిద్దిపేట జిల్లా కేంద్రానికి ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బస్సు వస్తుంది. మండలంలోని పలు గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మహాలక్ష్మీ పథకం బస్సు సౌకర్యం లేని గ్రామీణ మహిళలు, విద్యార్థినిలకు ఉపయోగం లేకుండా పోయింది. బస్సు సర్వీసులను అన్ని గ్రామాలమీదుగా నడిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.

-తిప్పారపు శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి

ప్రతి వాహనదారుడి ప్రాణాలూ ముఖ్యమే

- జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో వివిధ రోడ్లపై ప్రయాణిస్తున్న ప్రతి వాహనదారుడి ప్రాణాలు ముఖ్యమని మెదక్ కలెక్టర్ కె.హైమావతి అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్‌లో రోడ్డు భద్రతా కమిటీ, మత్తు పదార్థాల వినియోగ నివారణకు సంబంధించి అన్ని శాఖల అధికారులతో మెదక్ కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాజీవ్ రహదారి వెంబడి అతి ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్న కొన్ని బ్లాక్ స్పాట్ లో గుర్తించిన ఎడల వాటికి సంబంధించిన ఎస్టిమేట్ వేసి అన్ని డాక్యుమెంట్లు తయారుచేసి తన వద్దకు తీసుకురావాలని ఆర్ అండ్ బీ ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చెట్ల కొమ్మలు రోడ్లపై రావడం మూలంగా వాహనదారులకు అడ్డుగా ఉన్నందున వాటిని తొలగించాల్సిందిగా, అనధికార కట్టింగ్స్ మూసివేయాలని, వివిధ గ్రామాల నుండి రాజీవ్ రహదారి కలిసే ప్రాంతంలో జీబ్రా క్రాసింగ్ ఏర్పాటు, క్లోనింగ్, చౌరస్తాలలో బ్లింకింగ్ లైట్స్ అమర్చాలని హెచ్ కె ఆర్ అధికారులకు తెలిపారు. అవసరమైన చోట్ల సీసీ కెమెరా బిగించాలని, ఎక్కువగా మూలమలుపు ఉన్న ప్రాంతంలో కొన్ని గుర్తించిన స్పాట్లను రోడ్డు విస్తీర్ణం పెంచేందుకు భూ సేకరణ చేయాలని ఆర్ అండ్ బీ అధికారులకు తెలిపారు. ఈ సమావేశంలో ఏసీపీలు రవీందర్ రెడ్డి, సదానందం, నర్సింలు, ఎక్సైజ్ సూపరింటెంట్ శ్రీనివాస మూర్తి, ఆర్ అండ్ బి డిఈ వెంకటేశం, డిఎం అండ్ హెచ్ ఓ ధనరాజ్, డీఏవో స్వరూప రాణి, డిఇఓ శ్రీనివాస్ రెడ్డి, డి డబ్ల్యు వో లక్ష్మీకాంత్ రెడ్డి, ట్రాఫిక్ సిఐ, నేషనల్ హైవే-హెచ్ కె ఆర్ ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులు పెడుతున్నారు

గజ్వేల్ రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పోరాడుతూ ప్రభుత్వ వైఫల్యాలని ఎప్పటికప్పుడు ఎండగడుతున్న బీఆర్ఎస్ నాయకులపై ప్రభుత్వం అణచివేత అవలంభిస్తూ అక్రమ కేసులు పెడుతుందని గజ్వేల్ మండల యూత్ అధ్యక్షుడు కొలిచేలిమి కుమార్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా పాలన ఏమెర్జెన్సీని తలపిస్తుందని అన్నారు. అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ పార్టీ అడ్డగోలు హామీలు ఇచ్చి ఇప్పుడు అధికారంలోకి రాగానే అడిగితే అక్రమంగా కేసులు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు.

రైతన్నకు మరో'సారీ'

(5వ పేజీ తరువాయి)

ఆదుకునే ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని వచ్చే యాసంగి సీజన్ నుంచైనా అమలు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ పథకం ద్వారా లభించే పరిహారం రైతులను అప్పుల ఊబిలో కూరుకుపోకుండా కాపాడుతుంది. కాబట్టి, యాసంగి సీజన్ నుంచైనా ఈ పథకాన్ని అమలు చేసి తమకు అండగా నిలవాలని పలువురు రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టాలి

చేర్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లి-పెద్దరాజుపేట జడ్పీఎస్ఎస్‌కు ప్రహరీగోడ నిర్మాణం చేపట్టి విద్యార్థులకు రక్షణకల్పించాలని కోరుతూ గురువారం సీపీఐ నాయకులు స్థానిక తహసీల్దారు దిలీప్‌నాయక్‌కువినతిపత్రం అందించారు. ఈసందర్భంగా పార్టీ జిల్లా కార్యవర్గసభ్యుడు అందె అశోక్ మాట్లాడుతూ పాఠశాల గ్రామశివారులో ఉండటం, ప్రహరీగోడ లేకపోవడంతో విష పురుగులనుండి ప్రాణాపాయం పొంచి ఉండటంతో పాటు రాత్రి వేళ అసాంఘీక కార్యకలాపాలకు నిలయంగా మారిందన్నారు. ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కత్తుల భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా బీఆర్ఎస్

- రైతులకు న్యాయం జరిగేంతవరకు పోరాటం చేస్తాం
- గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి



రైతులకు మద్దతు పలుకుతూ మాట్లాడుతున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

వర్గల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ పరిసర ప్రాంతంలో పరిశ్రమల కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం జరిగేంతవరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని గజ్వేల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ మండలం నగరం తండా వద్ద రైతులు చేస్తున్న ఆందోళనకు మద్దతుగా నిలిచారు. ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కేసీఆర్ పరిశ్రమల కోసం భూములు సేకరించగా కాంగ్రెస్ పార్టీ నాయకులు అక్రమంగా కేసులు వేస్తు పరిశ్రమలు రాకుండ అడ్డుపడుతున్నరని, రైతులకు పూర్తి స్థాయిలో నష్ట పరిహారం, ప్లాట్ల కేటాయింపు జరగకుండా కోర్టులలో కేసులు వేస్తూ రైతుల ప్రయోజనాలను అడ్డుకుని రైతుల నోట్లలో మట్టి కొడుతున్నరన్నారు. గత ప్రభుత్వం ఎకరాకు రూ. 10 లక్షలు ఇస్తే అప్పట్లో ప్రస్తుత మంత్రులు ఎకరాకు రూ. 50 లక్షలు ఇస్తామన్న నాయకులు ఎటుపోయారని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు

శునకాలు, వానరుల హల్‌చల్



కొండముచ్చుల మీదికి వెళ్తున్న కుక్కలు

దుబ్బాక,జూలై31(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలో కోతులు, కొండముచ్చులు, కుక్కల స్వైరవిహారం ప్రజలను భయభ్రాంతులను గురి చేస్తుంది. గురువారం దుబ్బాకలోని పాలకేంద్రం వద్ద శునకాలు, వానరుల కొట్లాట రహదారిపై వెళ్లేవారిని భయభ్రాంతులకు గురి చేశాయి. కొండముచ్చుల గుంపు, కుక్కల గుంపు పరస్పరం దాడులు చేసుకుంటూ, రహదారిని స్తంభింపజేశాయి. ఆ రహదారి వెంట వెళ్లడానికి గంటసేపు భయం నెలకొంది. పాలకేంద్రంకు వచ్చే వారంతా భయం గుప్పిట్లో పక్కనున్న దుకాణ సముధాయలలోకి పరుగులు పెట్టారు. అటునుంచి వెళ్లే మహిళల మీదికి రావడంతో భయాందోళనకు గురయ్యారు.

తాళం పగలగొట్టి చోరీ

చేర్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి): చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు .ఈ సంఘటన గురువారం వెలుగుచూసింది. ఆకునూరు గ్రామానికి చెందిన తొట్టె రాజు చనిపోవడంతో కొన్నాళ్లుగా భార్య రజిత పిల్లలతో కలిసి హైదరాబాదులో నివసిస్తుంది. గ్రామంలో గల ఇంటికి అప్పుడప్పుడు వచ్చి వెళ్లిపోతుంటుంది. ఈక్రమంలో గురువారం ఇంటికి చేరుకుని తాళం తీసినా తలుపులు తెరుచుకోకపోవడంతో వెనక డోరు పరిశీలించేసరికి తలుపులు తెరిచిఉండటంతో ఆందోళనకు గురైంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరు వాడ్‌రోబ్ తెరిచి ఉండటంతో పాటు వస్తు, సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిపెట్టుకున్న 53తులాల వెండి కడియాలు, 20తులాల పట్టా గొలుసులు, గ్యాస్ పొయ్యి, గ్యాస్ సిలిండర్, ఇత్తడి పూజా,వస్తు సామాగ్రి చోరికి గురవడాన్ని నిర్ధారించుకుంది. దొంగతనానికి గురైన సొమ్ము విలువ సుమారు రూ.1లక్ష మేర నష్టం వాటిల్లిందని పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ చేపట్టారు.

ఇక.. హ్యామ్ రోడ్లు

(5వ పేజీ తరువాయి)

ముస్త్యాల-వడ్లకొండ రోడ్డు, చేర్యాల-కడవేర్గు-పెద్దరాజుపేట-నాగపురి రోడ్డు, రేబర్తి-వల్లంపట్లబైరాన్‌పల్లి-బెక్కల్-కొండాపూర్ రోడ్డు, వర్గల్-గజ్వేల్, సూరంపల్లి-నాచారం వరకు రోడ్లకు మహర్దశ పట్టనున్నది.

తీరనున్న వాహనదారుల ఇక్కట్లు

గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం రహదారులపై దృష్టి సారించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాత రోడ్లు మరింత దెబ్బతిని, ప్రయాణం కష్టంగా మారింది. అయితే, ఇప్పుడు ఆగస్టు రెండో వారంలో టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే సెప్టెంబరు మొదటి వారంలో పనులు ప్రారంభమయ్యేలా ఆర్‌అండ్‌బీ అధికారులు కృషి చేస్తున్నారు. రోడ్ల నిర్మాణంతో పాటు అవసరమైన చోట పాత కల్వర్టులను తొలగించి కొత్తవి నిర్మించనున్నారు. కొత్తగా మంజూరైన రహదారులతో పాటు పంచాయతీరాజ్ ప్రతిపాదనలు పంపిన రోడ్లను కూడా మంజూరు చేసి రహదారుల అభివృద్ధికి కృషి చేయాలని వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



గుంతలమయంగా మారిన ముగ్దాపూర్ రోడ్డు

కాంగ్రెస్ పాలనలోనే అభివృద్ధి

చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కాంగ్రెస్‌తోనే సాధ్యమని, పల్లెల్లో అభివృద్ధి కాంగ్రెస్‌హయాంలోనే జరిగిందని కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండలాధ్యక్షుడు కొమ్ము రవి అన్నారు. చేర్యాల మండలం నాగపురి గ్రామంలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సన్నాహకసమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ చేసిన అప్పులు తెలంగాణ ప్రజలపాలిట శాపంగా మారాయన్నారు. కానీ ప్రజాసంక్షేమానికి కట్టుబడి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికష్టాలు ఎదురైనాభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలుచేస్తుందన్నారు.

గౌరాయపల్లిలో పౌరహక్కుల దినోత్సవం

కొమురవెల్లి,జూలై31(ఆంధ్రజ్యోతి) మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో గురువారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రజలందరూ కలిసిమెలిసి ఉండి పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా పౌరహక్కులకు భంగం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్,హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

చేర్యాల, జూలై 31(ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణానికి చెందిన 52మందికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా, గురువారం స్థానిక మున్సిపల్ కమిషనర్ నాగేందర్ లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ కాపీలు పంపిణీచేశారు. ఈసందర్భంగా హర్షం వెలిబుచ్చుతూ బీఆర్ఎస్ నాయకులు ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు కలిసి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు.

పొలం బాట పట్టిన చిన్నారులు



వరి నాట్లు వేస్తున్న చిన్నారులు

వర్గల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం పుస్తకాలు, ఆటలతో పోటీ పడుతున్న చిన్నారులు కొత్త రూపం దాల్చారు. వర్గల్ మండలం తునికికాల్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం పొలం బాట పట్టారు. పాఠశాల ఉపాధ్యాయులకు కలిగిన ఆలోచనతో ప్రాజెక్టు వర్క్ (ఫీల్డ్ ట్రి ప్)లో భాగంగా చిన్నారులందరిని తీసుకుని వ్యవసాయ క్షేత్రానికి తీసుకెళ్లారు. వ్యవసాయం ప్రాధాన్యం, ఆహార భద్రత, రైతులను ఎలా గౌరవించాలి, తినే అహారం ఎక్కడ నుంచి వస్తుంది, ఏ విధంగా తయారవుతుంది, రైతులు ఎంత కష్టపడితే ఆహారం అవుతుందన్న విషయాలను ఆ ఉపాధ్యాయులు పొలం వద్ద ప్రత్యక్షంగా చూపిస్తూ వివరించారు. విద్యార్థులంతా పొలంలోకి దిగి వరి నాటు వేసి రైతుల యొక్క అనుభవాలను, రైతుల కష్టాలను, పంటలు పండే తీరు, ఆహార ధాన్యాల అవసరం వాటి విలువలను తెలుసుకున్నారు. పొలం వద్దనే ఉపాధ్యాయులు విద్యార్థులతో ఆహారం వృదా చేయమని, రైతులను గౌరవిస్తామని, రైతును కాపాడుకుందామని, ప్రతిజ్ఞ చేయించారు.

మంజూరైన ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలి

- అదనపు కలెక్టర్ గరీమా అగర్‌వాల్

రాయపోల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళు మంజూరైన 45 రోజుల్లోపు నిర్మాణ పనులు ప్రారంభించాలని అదనపు కలెక్టర్ గరీమా అగర్ వాల్ పేర్కొన్నారు. గురువారం ఆమె రాయపోల్ మండలం రామారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అంతకుముందు రాయపోల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. రామారం గ్రామంలో 183 ఇళ్లు మంజూరు కాగా ఇందులో సుమారు 90 మంది లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్ల మంజూరును రద్దు చేయాని అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. మిగతా వాటిలో 17 ఇళ్లు బేస్‌మెంట్ దశకు, ఏడు ఇళ్లు రూఫ్ లెవెల్ వరకు వచ్చాయి. గ్రామంలో ఇద్దరికి నగదు జమ కాలేదని అదనపు కలెక్టర్‌కు తెలుపగా పూర్తి వివరాలు సేకరించి బిల్లు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రారంభం కాని ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు.

త్వరలో రోడ్ల నిర్మాణానికి మహర్దశ



కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పడాల రాములు

దౌల్తాబాద్,జూలై ఆంధ్రజ్యోతి): గుంతలమాయంగా మారిన రోడ్లకు వివిధ గ్రామాల మీదుగా త్వరలోనే నిర్మాణం జరగబోతుందని దౌల్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పడాల రాములు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు పడాల రాములు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ. దుబ్బాక నియోజక కాంగ్రెస్ వర్గ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సహకారంతో రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం పట్ల హర్ష వ్యక్తం చేశారు. దౌల్తాబాద్ మండలంలోని గోడుగుపల్లి రోడ్డుకు రూ.5.60 కోట్లు,ముక్కరాజిపేట-తిర్మలాపూర్ రోడ్డుకు రూ. 7.77 కోట్లు,ఇందుప్రియల్-చందాయిపేట రోడ్డుకు రూ.4.27 కోట్లు,ముబ్బారాస్‌పూర్,మల్లేశంపల్లి,శారీపూర్ రోడ్డుకు రూ.4.20 కోట్లు,గొల్లపల్లి నుంచి- ఇందుప్రియల్ రోడ్డుకు రూ.2.60,సూరంపల్లి నుంచి- నాచారం వరకు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. అహర్నిశలు రోడ్ల నిర్మాణం కోసం కృషి చేసిన చెరకు శ్రీనివాస్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్టీ హాస్టల్ సమస్యలను పరిష్కరించాలి

గజ్వేల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని జాలిగామ బైపాస్ రోడ్డులో గల ఎస్టీ హాస్టల్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి డిమాండ్ చేశారు. గురువారం ఎస్టీ హాస్టల్‌ను సందర్శించిన ఆయన హాస్టల్‌లోని సమస్యలను గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీ హాస్టల్‌కు ప్రహరీగోడ లేక పాములు, పందులు, కుక్కలు, విషసర్పాలు సంచరిస్తున్నాయని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. దోమ తెరలు అందించాలని, మూడు నెలలుగా రాని కాస్మోటిక్ చార్జీలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పాఠశాలలు ప్రారంభమై 50రోజులు అవుతున్నా విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేయలేదన్నారు. ఏఎన్ఎం ద్వారా హెల్త్ చెకప్ చేయించాలని, మెనూ ప్రకారం తాజా కూరగాయలతో విద్యార్థులకు భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. ఆయనవెంట డీబీఎఫ్ గజ్వేల్ మండల అధ్యక్షుడు ఊశుల్ల చంద్రం తదితరులున్నారు.

మంత్రి వివేక్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్‌కు లేదు



సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు

సిద్దిపేట జూలై 31 (ఆంధ్రజ్యోతి): మంత్రి వివేక్‌ను విమర్శించే హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ కౌన్సిలర్లు సాకిబాల్ లక్ష్మీఆనంద్, రియాజుద్దీన్, తదితరులు తెలిపారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని, నాసిరకమైన డబుల్ బెడ్ రూమ్‌లు కట్టి ప్రజల ఉసురు పోసుకున్న ప్రభుత్వం మీదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారంటీలను అమలు చేయడంతో పాటు ప్రతి గ్రామాల్లో, తండాల్లో ఎక్కడ చూసిన ఇందిరమ్మ ఇళ్ల ముగ్గులు పోసుకొని ఆనందంగా ఉన్నారని తెలిపారు. పేద ప్రజలకు రేషన్‌షాపుల్లో సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్



వెలగని సిగ్నల్స్

గజ్వేల్, జూలై 31(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ సిగ్నల్స్ సమమానుకూలంగా పనిచేయడం లేదు. పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను నివారించేందుకు సిగ్నల్స్ ను ఏర్పాటు చేసిన అధికారులు వాటిని మరమ్మతు చేయించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఉదయం వేళ పని చేసి సాయంత్రానికి నిలుపుదల చేసే టైం ట్రాకింగ్ సిస్టం దెబ్బతిన్నది. దీంతో ఉదయం వేళ స్కూల్ బస్సులు, కళాశాల బస్సులు, వాహనాలు వచ్చే సమయంలో ట్రాఫిక్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో పలు చౌరస్తాలలో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఉదయం 11 సమయంలో సిగ్నల్స్ ఆన్ అయి రాత్రి 11గంటల సమయంలో ఆఫ్ అవుతున్నాయి. ట్రాఫిక్ లేని సమయంలో ఆన్ అవుతున్న సిగ్నల్స్... ట్రాఫిక్ ఉన్న సమయంలో పనిచేయడం లేదు. దీంతో ఎంతో ఖర్చుతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయని, వెంటనే టైం ట్రాకింగ్ సిస్టం సరి చేయించాలని వాహనదారులు, గజ్వేల్ ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ ఏఈకి ఈ విషయమై ఇప్పటికే సమాచారం అందించామని ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు.

అధ్వానంగా మీర్జాపూర్-మల్లంపల్లి

ప్రధాన రహదారి

- రోడ్డు మరమ్మతు చేసి ఇబ్బందులు తీర్చాలని ప్రజల విజ్ఞప్తి

హుస్నాబాద్‌రూరల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం వాహన రాకపోకలతో రద్దీగా ఉండే మీర్జాపూర్- మల్లంపల్లి ప్రధాన రహదారి గుంతలమయంగా తయారైంది. ఈ రహదారిపై వెళ్తున్న ప్రయాణికులు నిత్యం ప్రమాదాలబారిన పడుతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. పోతారం(ఎస్) క్రాసింగ్ పుల్‌నాయక్‌తండా, వంగరామయ్యపల్లి, బల్లునాయక్ తండా, మల్లంపల్లి, కేశవాపూర్, మోత్కులపల్లి, కట్కూర్ క్రాసింగ్‌వరకు రోడ్డు పూర్తిగా అధ్వాన్నంగా తయారైంది. వర్షంతో గుంతలన్నీ వర్షంనీటితో నిండిపోయి రోడ్డు ప్రమాదకరంగా తయారైంది. ప్రతి రోజు ఈ రహదారి వెంట వెళ్తున్న ప్రయాణికుల్లో ఇద్దరు ముగ్గురు ప్రమాదాలతో ఆసుపత్రిపాలౌతున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిని తాత్కాలింగా నైనా మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కోరుతున్నారు.

నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నాం

పోతారం(ఎస్) క్రాసింగ్ నుంచి మీర్జాపూర్-మల్లంపల్లి రోడ్డు గుంతలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షం పడితే గుంతల్లో నీరు చేరి రోడ్డు ఏర్పడగా గుంతల్లో పడి కాళ్లు చేతులు విరిగి ఆసుపత్రుల పాలౌతున్నాం. అధికారులు, మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించి ఈ రోడ్డును డబుల్‌రోడ్డు మంజూరు చేసి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

- పొన్నబోయిన శ్రీనివాస్- మీర్జాపూర్ గ్రామస్థుడు

హ్యామ్ ప్రాజెక్టు కింద ఈ రోడ్డు ఎంపిక

పోతారం(ఎస్) క్రాసింగ్ నుంచి మీర్జాపూర్,మల్లంపల్లి, మోత్కులపల్లి, కట్కూర్ క్రాసింగ్ రోడ్డు వరకు 11 కి.మీ రోడ్డు సీఎం హ్యామ్ ప్రాజెక్టు కింద ఎంపికైంది. నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే టెండర్ పక్రియ పూర్తై డబుల్ రోడ్డుగా పనులు ప్రారంభం కానున్నాయి. ఆమ్ ప్రాజెక్టు ద్వారా ఈ రోడ్డు 20 సంవత్సరాలు మేయింటనెన్స్ జరుగుతుంది.

- పంచాయతీ రాజ్ ఏడీఈ టి మహేశ్వర్



ప్రమాదకరంగా ఉన్న గుంతలు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం



పుల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ధనరాజ్

సిద్దిపేట రూరల్,జూలై31(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ధనరాజ్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, చింతమడక, నారాయణరావుపేట మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. నారాయణారావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నీటి వసతి సరిగలేకపోవడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. బోరులో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ టాయిలెట్స్‌లకు నీటి సరఫరా లేకపోతే ఎలా అని మెడికల్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. త్వరలోనే జిల్లా కలెక్టర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించనున్నట్లు సిబ్బందికి సూచించినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బాపురెడ్డి, భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.